క్లుప్తంగా

పంచాయతీల అభివృద్ధిపై దృష్టి



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ రమణయ్య

చిట్టమూరు: గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీల అభివృద్ధిపై దృష్టి సారించాలి వైస్ ఎంపీపీ బీవీ రమణయ్య అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని స్త్రీశక్తి భవనంలో పంచాయతీ పురోగతి సూచికపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అధ్యక్షత వహించి వైస్ ఎంపీపీ మాట్లాడారు. ప్రభుత్వం పంచాయతీలకు ఉన్న హక్కులను తమ గుప్పెట్లో ఉంచుకుని సర్పంచులకు అధికారాలు లేకుండా చేస్తోందని, అలా కాకుండా సర్పంచులు పార్టీలకు అతీతంగా వీటిని సాధించుకుని పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఏఓ విజయలక్ష్మి, ఎంఈఓ బీవీ కృష్ణయ్య, ఈఓపీఆర్డీ జనార్ధన్, సర్పంచులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న దాతలు

ఓజిలి: మానమాలలోని బాబా మందిరంలో గురువారం సాయినాథునికి ప్రత్యేక పూజలు, కాగడ హారతి పూజలు, క్షీరాభిషేకం చేశారు. గజమాలతో బాబాను అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి పల్లకిసేవ నిర్వహించారు. నిర్మాణకర్తలు హరనాథ్‌రెడ్డి, శోభారాణి, భక్తులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని గేదెలు మృతి



రోడ్డుపై మృతి చెందిన గేదెలు

చిట్టమూరు: గుర్తు తెలియని వాహనం ఢీకొని గేదెలు మృతి చెందిన సంఘటన గురువారం మండలంలోని నాయుడుపేట–మల్లాం రహదారిలో చోటుచేసుకుంది. బాధితుడి కథనం.. మన్నెమాలకు చెందిన పాడి రైతు వేల్పూరు మణి తన రెండు గేదెలను మేతకోసం వదిలాడు. అవి రోడ్డుపై వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ఘటనలో గేదెలు అక్కడికక్కడే మరణించాయి. వీటి విలువ సుమారు రూ.80 వేలని బాధిత రైతు కన్నీటిపర్యంతమయ్యాడు.

ఆటోను ఢీకొని మోటార్ సైక్లిస్టుకు గాయాలు

కోట: మోటార్ సైకిల్, ఆటో ఢీకొనడంతో ఒకరి గాయాలైన సంఘటన గురువారం కేసవరం వద్ద ప్రధాన రహదారిపై చోటుచేసుకుంది. వివరాలు.. కేసవరానికి చెందిన వేణు బైక్‌లో కోటకు వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆటోను అదుపు తప్పి ఢీకొన్నాడు. ప్రమాదంలో వేణుకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108లో అతడిని గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పింఛన్ల పంపిణీపై ఎంపీడీఓ విచారణ

కలువాయి(సైదాపురం): మండల కేంద్రమైన కలువాయిలోని ముస్లింపాళెంలో పింఛన్ల పంపిణీలో నగదు వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలో గురువారం ఎంపీడీఓ శైలజ ఆ ప్రాంతానికి వెళ్లి విచారణ చేశారు. తమ ప్రాంతంలో ఎలాంటి అవకతవకలు జరగలేదని పలువురు స్థానికులు ఎంపీడీఓకు తెలియజేశారు.

ఇష్టారాజ్యంగా తవ్వకం



పట్టణంలో గ్యాస్ పైపులైన్ల ఏర్పాటుకు లోతుగా తవ్వుతున్న దృశ్యం



తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీ వాసులు

- గ్యాస్ పైపులైన్ల నిర్వాహకుల నిర్వాకం
- తాగునీటి పైపులైన్లు పగిలిపోయి నీటికి ఇక్కట్లు
- చర్యలు తీసుకోని మున్సిపల్ అధికారులు
- ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేసిన మహిళలు

నాయుడుపేటటౌన్: పట్టణంలో పలుచోట్ల ప్రైవేటు గ్యాస్ పైపులైన్ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా లోతుగా గుంతలను తవ్వుతుండడంతో తాగునీటి పైపులైన్లు పగిలిపోతున్నాయి. దీంతో పట్టణంలో పలు ప్రాంతాల్లో తాగునీటి సరఫరా లేక ప్రజలు నానా ఇక్కట్లు పడుతున్నారు. మూడు రోజులకు పైగా పట్టణంలో పాగొట్టం కాలనీ, జైహింద్ కాలనీ తదితర ప్రాంతాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. సీఐటీయూ నాయకులు కాలనీ వాసులతో కలిసి గురువారం ఖాళీ బిందెలతో ఆందోళన చేయడంతో అధికారులు వాటర్ ట్యాంకర్లతో నీటిని సరఫరా చేశారు. ప్రైవేటు గ్యాస్ పైపులైన్ల నిర్వాహకుల చర్యలపై కఠినంగా వ్యవహరించాలని పలుమార్లు మున్సిపల్ సమావేశంలో పాలక వర్గం కమిషనర్‌ను కోరుతున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలొస్తున్నాయి. ఇప్పటికే పట్టణంలో సిమెంటు రోడ్లను గుంతలమయం చేసిన పైపులైన్ల నిర్వాహకులపై చర్యలు తీసుకోకపోతే మరిన్ని సమస్యలను ప్రజలు ఎదుర్కొనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఇదలా ఉంచితే, ప్రైవేటు గ్యాస్ పైపులైన్ల నిర్వాహకులపై ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజులుల్లా చెప్పారు. దీనిపై సీఐ బాబి వివరణ కోరగా., ప్రైవేటు గ్యాస్ పైపులైన్ల నిర్వాహకులపై కేసు నమోదు చేయలేమని చెప్పారు.

వర్షం..ఉపశమనం



మండలంలో వారం రోజుల నుంచి సాయంత్రం వర్షం కురుస్తోంది. ఎండ, ఉక్కపోతతో అల్లాడిన ప్రజలకు వర్షం ఉపశమనం కలిగిస్తోంది. గురువారం సాయంత్రం సైతం వర్షం కురిసింది. వర్షపునీరు రహదారులపై ప్రవహించడంతో జలమయమయ్యాయి. వాహనచోదకులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

- ఓజిలి

పచ్చ మీడియావి నీచ రాతలే

- నకిలీ మద్యంపై పెదవి విప్పని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి చిందేపల్లి విమర్శ



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

పెళ్లకూరు: నకిలీ మద్యం తయారీకి నాంది జగన్ హయాంలోనే అంటూ పచ్చమీడియా వండి వారుస్తున్న నీచ జర్నలిజానికి నిదర్శనమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి చిందేపల్లి మధుసూదన్‌రెడ్డి ఘాటుగా విమర్శించారు. గురువారం పుల్లూరులోని ఆయన నివాసంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులు, నిరుద్యోగులు, కార్మికులు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోని పచ్చమీడియా పొద్దస్తమానం వైఎస్సార్ సీపీని, జగనన్నపై నీచమైన రాతలు రాయడమే పనిగా పెట్టుకుందని దుయ్యబట్టారు. చంద్రబాబు స్వలాభం కోసం నకిలీ మద్యం తయారీ కేంద్రాలు నెలకొల్పి అమాయకుల ప్రాణాలను బలిగొంటున్నారని ఆరోపించారు. నకిలీ మద్యం కేసులో ముక్కుబడిగా ఇద్దరు టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవడం చూస్తే కేసును నీరుగార్చేందుకేనని మండిపడ్డారు. నకిలీ మద్యం వల్ల బలై పోతున్న బాధిత కుటుంబాల తరఫున ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ప్రభుత్వాన్ని ఎందుకు ప్రశ్నించడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో మద్యం రేట్లు పెంచినందుకు పేదల కడుపు కొడతావా జగన్? అంటూ ఊగిపోయిన పవన్ ఇప్పుడు ఏమైపోయారని, నోట మాట పెగలడం లేదా? అని నిలదీశారు. సమావేశంలో నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

మండల అధికారులతో సమావేశం

ఓజిలి: పంచాయత్ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్, ట్రాన్సాక్షన్‌పై శుక్రవారం ఉదయం పదిగంటలకు మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు, ఎస్ఎస్ఓ, పంచాయతీ కార్యదర్శులకు సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నారాయణరెడ్డి గురువారం తెలిపారు.

నేడు డిజిటల్ బుక్ ఆవిష్కరణ

సైదాపురం: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను కాపాడుకునేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సూచనల మేరకు వైఎస్సార్‌సీపీ డిజిటల్ బుక్, క్యూ ఆర్ కోడ్ స్కానర్‌ను శుక్రవారం నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తన స్వగృహంలో ఆవిష్కరించనున్నట్లు పార్టీ మండల కన్వీనర్ మన్నారపు రవికుమార్ యాదవ్ తెలిపారు. మండలంలోని పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

‘పాపకన్ను’కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, దయాకర్‌రెడ్డి

రాపూరు: మండలంలోని వేపినాపిలో మాజీ సమితి అధ్యక్షులు, వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యులు పాప కన్ను రాజశేఖరరెడ్డి ప్రథమ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, పార్టీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ పాపకన్ను మధుసూదన్‌రెడ్డి, పార్టీ మండల మాజీ కన్వీనర్ పాపకన్ను దయాకర్ రెడ్డి, పాపకన్ను వేణుగోపాల్‌రెడ్డి, పాపకన్ను నిరంజన్‌రెడ్డి, పాపకన్ను ప్రభాకర్‌రెడ్డి, దందోలు లక్ష్మీనారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ పెంచలరెడ్డి, పలువురు వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు ఘన నివాళులు అర్పించారు.

చేగువేరా గొప్ప మానవతావాది



చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఫౌండేషన్ ప్రతినిధులు

గూడూరు రూరల్: చేగువేరా విప్లవకారుడు మాత్రమే కాదని, గొప్ప మానవతావాది అని చేగువేరా ఫౌండేషన్ వ్యవస్థాపకులు మండ్ల సురేష్‌బాబు అన్నారు. చేగువేరా 58వ వర్ధంతిని, ఫౌండేషన్ 14వ వార్షికోత్సవాన్ని గురువారం గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి స్టేడియంలో నిర్వహించారు. చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. చేగువేరా చేసిన పోరాటాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని ముందుకుపోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గుండాల ఆదినారాయణ, దువ్వూరు దిలీప్ రెడ్డి, ఓరేపల్లి బాబు, శేఖర్‌రెడ్డి, మల్లికార్జున్‌రెడ్డి, జగన్ రెడ్డి, సురేష్‌రెడ్డి, రాయల్ క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు టీఆర్. మణి, కిషోర్, పవన్‌కుమార్, దీపక్, సుశీల్, సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

వివాదాస్పదంగా గ్రామసభ





గ్రామ సభ నిర్వహిస్తున్న దృశ్యం, సమావేశం వద్ద ఇరు గ్రామాల నేతల వివాదం

బాలాయపల్లి(సైదాపురం): మండలంలోని వెంగమాంబపురంలో గురువారం నిర్వహించిన విభజన గ్రామ సభ వివాదాస్పదమైంది. పంచాయతీలోని అక్కసముద్రం గ్రామాన్ని పంచాయతీగా ఏర్పాటు చేయాలని టీడీపీ నాయకుల వినతి మేరకు ప్రజాభిప్రాయ సేకరణ నిమిత్తం గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి దయాకర్ గ్రామ సభను నిర్వహించారు. మొత్తం 122 మంది హాజరుకాగా వైఎస్సార్ సీపీ సర్పంచ్ బాసనపల్లి వెంకటసుబ్బయ్య పంచాయతీ విభజనను వ్యతిరేకించి, గ్రామ సభను బహిష్కరించారు. దీంతో ఇరుగ్రామాల టీడీపీ నేతలు, కార్యకర్తల మధ్య తీవ్ర స్థాయిలో వివాదం చోటుచేసుకుంది. స్థానికుల జోక్యంతో ఇది సద్దుమణిగింది. తమకు జరిగిన అన్యాయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని గ్రామస్తులు చెప్పారు.

నిడిగల్లు పంచాయతీలో..

అలాగే నిడిగల్లు పంచాయతీ నుంచి గాజులపల్లె, గొల్లపల్లె గ్రామాలను వేరు చేయాలని గాజులపల్లె గ్రామస్తుల వినతితో గ్రామ సభ నిర్వహించారు. సమావేశానికి సర్పంచ్ చప్పిడి గాయత్రి అధ్యక్షతన కార్యదర్శి మోహన్‌రాజు నిర్వహించారు. గ్రామ సభకు 110 మంది హాజరుకాగా 109 మంది పంచాయతీ విభజనకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రత్నమ్మ, నిడిగల్ల సొసైటీ అధ్యక్షులు ఆది వెంకట కృష్ణారెడ్డి, నీటి సంఘం అధ్యక్షులు దాసరి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కండలేరులో 59.206 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో గురువారం నాటికి 59.206 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల జలాశయం నుంచి కండలేరుకు 3400 క్యూసెక్కుల నీరు చేరుతోందని, ఇక్కడి నుంచి సత్యసాయి గంగ కాలువకు 1200, పిన్నేరు కాలువకు 80, లోలెవల్ కాలువకు 40, హైలెవల్ కాలువకు 150, మొదటి బ్రాంచ్ కాలువకు 5 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

స్కూల్ గేమ్స్ జిల్లా స్థాయి పోటీలకు క్రీడాకారుల ఎంపిక



జిల్లా పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

నాయుడుపేటటౌన్: స్థానిక బాలుర జెడ్పీ హైస్కూలు ఆవరణలో గురువారం స్కూల్ గేమ్స్ జిల్లా స్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. అండర్ –14, 17 విభాగాలలో అథ్లెటిక్స్‌తో పాటు కబడ్డీ, ఖో–ఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చదరంగం, యోగా పోటీలు నిర్వహించారు. సూళ్లూరుపేట డివిజన్‌లోని అన్ని ప్రభుత్వ, పాఠశాలలో మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులు ఈ పోటీలకు హాజరయ్యారు. పోటీల్లో గెలుపొందిన వారు జిల్లా స్థాయి పోటీలలో పాల్గొంటారని ఎంఈఓ మునిరత్నం తెలిపారు. విజేతలకు ట్రోఫీలు అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్, నెలవల రాజేష్, హెచ్ఎం మంజుల, ఫిజికల్ డైరెక్టర్లు సుజాత, మల్లికార్జున, రాఘవేంద్ర పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పన వేగవంతం

- త్వరలోనే రైతులకు పరిహారం చెల్లింపు
- సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా



క్రిస్‌సిటీ భూముల్లో పనులను పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్

చిల్లకూరు: తీరప్రాంతంలో ఏర్పాటు చేయతలపెట్టిన క్రిస్ సిటీలో మౌలిక వసతుల కల్పనను త్వరితగతిన పూర్తి చేయాలని గూడూరు సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా ఆదేశించారు. గురువారం ఆయన క్రిస్ సిటీలో చేస్తున్న పనులను పరిశీలించి కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులతో మాట్లాడారు. వర్షాలు విరివిగా కురవకమునుపే రహదారులు, కార్యాలయ భవనాల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలన్నారు. క్రిస్‌సిటీకి భూములు కోల్పోయిన రైతులకు త్వరలోనే పరిహారం చెల్లిస్తామని, ఎవరైనా తమకు పరిహారం మంజూరు కాలేదని పనులను అడ్డుకుంటే నేరుగా తమ కార్యాలయంలో సంప్రదించాలని రైతులకు తెలియజేయాలని వారికి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రికెట్ విజేత అనిల్ జట్టు



విజేత కప్పును అందుకుంటున్న క్రికెట్ జట్టు

చిల్లకూరు: క్రీడా స్ఫూర్తితో స్నేహభావం పెంపొందించుకోవచ్చని మాజీ రొటేరియన్ గవర్నర్ కొనిదల మునిగిరీష్ అన్నారు. గూడూరులోని అల్లూరు ఆదిశేషారెడ్డి స్టేడియంలో మూడు రోజుల ఫ్రెండ్షిప్ క్రికెట్ టోర్నీ గురువారం ముగిసింది. విన్నర్స్‌గా అనిల్ జట్టు, రన్నర్స్‌గా పవన్ జట్టు నిలిచాయి. బహుమతుల ప్రదానంలో మునిగిరీష్ మాట్లాడారు. చేగువేరా ఫౌండేషన్ నిర్వాహకులు సురేష్‌బాబు, ఆదినారాయణ వెటరన్లుగా ఉన్న స్నేహితులందరినీ ఒక్కచోట చేర్చేందుకు రాయల్ క్రికెట్ క్లబ్ సహకారంతో ఈ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రాయల్ క్రికెట్ క్లబ్ వ్యవస్థాపకులు మణి, మానికల పవన్‌కుమార్, ఆకాష్ దీపక్, సుశీల్ కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ



గూడూరు రూరల్ : గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆవరణలో గురువారం జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పేద గర్భిణులకు, వారి సహాయకులు వెజిటబుల్ రైస్, గుడ్లు, అరటి పండ్లను డాక్టర్ రాజా, చలపతిగౌడ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. గుర్రం విజయ్‌బాబు వితరణతో ఈ కార్యక్రమం నిర్వహించా రు. జేవీవీ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, నాగరాజు, చెంచునారాయణ, రామమోహన్, సుబ్బా రావు, అరుణ్ కుమార్, ప్రభాకర్, రజనీకాంత్, ఆనంద్, శ్రీనివాసాచారి, ఇబ్రహీం, సాయి పాల్గొన్నారు.

రెండు మెమో రైళ్లు రద్దు

నాయుడుపేటటౌన్: సూళ్లూరుపేట నుంచి నెల్లూరుకు వెళ్లే రెండు మెమో రైళ్ల రాకపోకలు శుక్రవారం పూర్తిగా రద్దు చేసినట్లు రైల్వే స్టేషన్ మేనేజర్ చిరంజీవి సోమవారం తెలిపారు. సూళ్లూరుపేట నుంచి ఉదయం 10.25వచ్చే రైలు (66041), నెల్లూరు నుంచి సాయంత్రం 5.30కు వచ్చే రైలు (66040), సూళ్లూరుపేట నుంచి సాయంత్రం 4.25కు వచ్చే రైలు (66037), నెల్లూరు నుంచి రాత్రి 8 గంటలకు నాయుడుపేటకు వచ్చే రైలు (66038) రద్దయినట్లు తెలిపారు. విజయవాడ–గూడూరు రైల్వే సెక్షన్ల పరిధిలోని చేస్తున్న పనుల కారణంగా వీటిని రద్దు చేసినట్లు రైల్వే ఉన్నతాధికారులు ప్రకటించినట్లు చెప్పారు. ప్రయాణికులు దీనికి సహకరించాలని రైల్వే స్టేషన్ మేనేజర్ కోరారు.

సీసీ రోడ్డు విలాపం





పట్టణం నుంచి చంద్రబాబు నాయుడు కాలనీకు వెళ్లే రోడ్డుపై టిప్పర్లు భారీగా గ్రావెల్, మట్టి తరలింపు తరలింపు కారణంగా సిమెంట్ రోడ్డు ధ్వంసమైంది. దీంతో ఆ ప్రదేశం ప్రమాదాలకు తావిస్తోంది. ప్రధానంగా రాత్రి పూట ద్విచక్రవాహనదారులకు ప్రమాదాలకు గురవుతున్నారు. సీసీ రోడ్డు ధ్వంసానికి కారకులపై మున్సిపాలిటీ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రజలు మండిపడుతున్నారు. ప్రమాదకరంగా మారిన సిమెంట్ రోడ్డు వద్ద యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాలని, టిప్పర్ యాజమానులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- నాయుడుపేటటౌన్

ఆత్మగౌరవాన్ని చంపుకోలేం!

- ప్రభుత్వం తీరుపై సచివాలయ ఉద్యోగుల నిరసన
- అధికారిక వాట్సప్ గ్రూపుల నుంచి నిష్క్రమణ



ఎంపీడీఓ ప్రమీలారాణికి వినతి పత్రం ఇస్తున్న సచివాయ ఉద్యోగులు

పెళ్లకూరు: ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేస్తూ ఆత్మ గౌరవాన్ని చంపుకునేలా విధులు నిర్వర్తించలేమని పలువురు సచివాలయ ఉద్యోగులు నిరసన వ్యక్తం చేశారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ ప్రమీలారాణిని కలిసి వినతి పత్రం ఇచ్చి మాట్లాడారు. డోర్ టు డోర్ వెళ్లి చేసే పనులు అప్పగించరాదని పలుమార్లు కూటమి ప్రభుత్వానికి విన్నవించినా స్పందన లేదని మండిపడ్డారు. రాష్ట జేఏసీ పిలుపు మేరకు అధికారిక వాట్సప్ గ్రూపుల నుంచి నిష్క్రమిస్తున్నట్లు చెప్పారు. ఉద్యోగ బాధ్యతలను నిర్వర్తించేందుకు అన్నివేళలా సిద్ధంగా ఉంటామని, ఆత్మగౌరవం దెబ్బతినేలా పనులు అప్పగిస్తే చేసేది లేదని తేల్చిచెప్పారు. కార్యక్రమంలో వివిధ గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.